





















RECRUITMENT

Andhra Hospitals - Visakhapatnam
Requires following candidates

- DIALYSIS TECHNICIANS
- PERFUSIONIST
- CSSD/ OT TECHNICIANS
- RADIOGRAPHERS
- CATHLAB TECHNICIANS

Interested candidates please send their complete **BIO - DATA** to the undermentioned e-mail id

E-mail Id: andhrahospitals.recruitment@gmail.com













సంక్షిప్తంగా...

వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు

బాడంగి: మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో అవ్వ, తాతలకు ఉచిత నేత్ర పరీక్షలు గురువారం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారు శిబిరాన్ని నిర్వహించగా 85మంది హాజరవ్వగా వీరిలో 33మందిని కంటి శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశామని క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ చెప్పారు.

సీతంరాజును గెలిపించాలి : ఎమ్మెల్యే



బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను పట్టభద్రులు గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు కోరారు. పట్టణంలో కళింగ వైశ్య భవనంలో ఎమ్మెల్సీ ఓటర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులంతా తొలి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి శ్రీనివాసరావు, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో..

బాడంగి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. సీతంరాజుకు మద్దతుగా గురువారం ప్రచారం చేశారు.

తైక్వాండో పోటీలకు బొబ్బిలి విద్యార్థులు

బొబ్బిలి: ఎలమంచిలిలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీలకు బొబ్బిలికి చెందిన లోహిత్‌కుమార్, జాహ్నవి, చరిత, జాజిలి, గౌతమి తదితరులు పాల్గొననున్నట్టు కోచ్ బంకురు ప్రసాద్ గురువారం తెలిపారు. వీరిని తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల సిబ్బంది అభినందించారు.

పైపులైన్ల మరమ్మతు పనుల పరిశీలన



పైపులైన్ల పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులలో భాగంగా చేపడుతున్న పైపులైన్ల మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. కోరాడవీధి, జెండావీధుల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి, సంబంధిత కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారం

రాజాం: స్పందనలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి కమిషనర్ ఎంపీ నాగరాజు అన్నారు. మండలంలో పొనుగుటివలస, శ్రీనివాసరోడ్డులలో మురుగు సమస్య పరిష్కారానికి గురువారం చర్యలు తీసుకున్నారు. ప్రజలు స్థానిక సమస్యలపై స్పందనలో ఫిర్యాదు చేయాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మహిళ లేకుంటే మనుగడ లేదు..

మెంటాడ: సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవడమే కాకుండా వారు లేనిదే మనుగడ కూడా సాధ్యపడటం లేదని గజపతినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ, వెలుగు ఆధ్వర్యంలోని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల నుండి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ జరిగింది. అనంతరం ఎంపీడీఓ సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు పాల్గొన్నారు.

సారా, గంజాయి విక్రయాలపై నిఘా



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ అస్మాఫర్హీన్

రాజాం సిటీ: గ్రామాల్లో, పట్టణాల్లో సారా, గంజాయి, మత్తుపదార్థాల విక్రయాలపై నిఘా పెట్టాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మాఫర్హీన్ అన్నారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామ/వార్డు సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల విక్రయించేవారి సమాచారం అందించాలని కోరారు. ఎస్ఈబీ ఎస్సై పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థుల ఆవేదన

బొబ్బిలి రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో తమతో కళాశాల సిబ్బంది రూమ్‌లు క్లీనింగ్, యంత్రాల క్లీనింగ్ చేయిస్తున్నారని విద్యార్థులు రాత పూర్వకంగా ఉన్నతాధికారులకు, పత్రికా ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. పారిశుధ్య సిబ్బంది సరిగా విధులు నిర్వహించడం లేదని, ఒకరికి బదులు ఒకరు ఉద్యోగాలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు.

మెనూ ప్రకారం 'భోజనం'

రామభద్రపురం: పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ప్రత్యేకాధికారి గోవిందరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలలు గురువారం ఆయన పలు పాఠశాలలు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం దగ్గర నుంచి టీచర్ల విద్యాబోధన, విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ రమామణి పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగికి సత్కారం

రాజాం: వైఎస్సార్ క్రాంతి పథం సీసీగా పనిచేస్తున్న వన్నెల దుర్గమ్మ ఉత్తమ సీసీగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు, వెలుగు సీసీ చిరంజీవి, ఏపీఎం టి.దధికుమార్, ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోవర్‌తో సరిహద్దుల గుర్తింపు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేలో రోవర్ సహాయంతో సరిహద్దుల గుర్తింపు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పూనువలస పంచాయతీ జె.కొత్తవలస గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓ, రైతులను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడారు. భూముల రీసర్వేలో సరిహద్దుల గుర్తింపు కార్యక్రమం చాలా ప్రాముఖ్యమైనదని, దీనిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సచివాలయ సర్వేయర్లు సరిహద్దులను గుర్తించాలని తెలిపారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ వెంకటరమణ, ఆర్ఎస్‌డీటీ రవికిరణ్ ఉన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

బాడంగి: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రథమ ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రామదాసు గురువారం తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు మించి ఉండరాదని, గురుకులం, ఎస్సీ వసతిగృహాల్లో చదివిన వారికి ఒక ఏడాది వయసులో వెసులుబాటు ఉంటుందన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష మించరాదన్నారు. అర్హులైన వారు ఏపీజీపిసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 24లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపీసీ, బైపీసీ 40 సీట్లు వంతున ఖాళీలున్నట్టు చెప్పారు.

యోగాతో ఆరోగ్యం

రేగిడి: యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు రామకృష్ణ అన్నారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. ప్రతిరోజు గంటపాటు చేయాల్సిన యోగాసనాల గూర్చి విద్యార్థులకు వివరించారు. ఆయనతోపాటు ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రమ్మ పేరంటాల పండుగ

బాడంగి: ముగడ గ్రామానికి చెందిన చెరువు గట్టు వేపచెట్టుపై వెలసిన ఎర్ర మ్మ పేరంటాలు పండుగను గ్రామస్తులు గురువారం ఘనంగా జరిపారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ముగడతో పాటు ముగడ కాలనీ, బాడంగి గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన డోలాయాత్ర

సంతకవిటి: మండలంలో గుళ్లసీతారాంపురం గ్రామంలో సీతారాముల ఆలయ డోలాయాత్ర గురువారంతో ముగిసింది. ఆలయంలో సీతారాములకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రా స్థలం వద్ద నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈఏడాది దేవాదాయశాఖ ఈ యాత్ర నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో ఈఓ బీవీ మాధవరావు తీరుపై పలువురు విమర్శలు కురిపించారు.